క్లుప్తంగా

ఆకట్టుకున్న విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన



తెనాలి అర్బన్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని నెహ్రూనికేత్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ పేర్కొన్నారు. బాలాజీరావుపేటలోని స్కూలులో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ పేరిట ఏర్పాటు చేసిన విద్యా,వైజ్ఞానిక ప్రదర్శనను శుక్రవారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులు పలు గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రాల నమూనాలను తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో మధుబాబు ప్రతిభ



మంగళగిరి: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కార్పొరేషన్ పరిధిలోని నవులూరుకు చెందిన ఎం.మధుబాబు ద్వితీయ స్థానం సాధించాడు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహిస్తున్న 36వ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్టేట్ లెవెల్ అథ్లెటిక్ మీట్ హర్డిల్స్ అండర్ -18 పురుషుల విభాగంలో 400 మీటర్లు హర్డిల్స్ పోటీల్లో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రాణించి ద్వితీయ స్థానం సాధించిన మధుబాబుకు విజేత స్పోర్ట్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీఎస్‌బీ సత్యనారాయణ, ఐ.వెంకట్రావు, కోచ్ కృష్ణ మోహన్ అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు అఖిల్



తాడేపల్లిరూరల్: రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎస్.అఖిల్‌ఎంపికయ్యాడు. అతడు దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్నాడు. విద్యార్థిని శుక్రవారం ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్‌ఎం పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ చేబ్రోలు మండలం నారా కోడూరులో నిర్వహించిన జిల్లా జట్టు ఎంపికల్లో అఖిల్ విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈనెల 29 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు తెనాలిలోని ఎస్ఎస్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటాడని తెలిపారు.

అంతర్జాతీయ న్యాయవాదుల సదస్సుకు ఆహ్వానం

గుంటూరు లీగల్: న్యూఢిల్లీ విద్యాభవన్‌లో ఈ నెల 24, 25 తేదీల్లో జరగనున్న అంతర్జాతీయ న్యాయవాదుల సదస్సులో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆహ్వానం మేరకు రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి పాల్గొననున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సులో న్యాయవాదుల భవిష్యత్ ప్రయోజనాలు తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. భారత్ ప్రధాని నరేంద్ర మోదీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, భారత ప్రధాన న్యాయమూర్తి వై.వి.చంద్రచూడ్, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాతోపాటు కేంద్ర మంత్రులు, న్యాయనిపుణులు పాల్గొంటారని వివరించారు.

పెన్షనర్ల సమస్యల్ని పరిష్కరించాలి

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: పెన్షనర్ల సమస్యల్ని పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డి. వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. బ్రాడీపేట తాలూకా ప్రాంగణంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిల్ని చెల్లించాలని కోరారు. అసోసియేషన్ సలహాదారు దాలినాయుడు మాట్లాడుతూ సీఎఫ్‌ఎంఎస్ విధానంలో పెన్షనర్లకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వారి సమస్యల్ని పాత విధానంలో ఎస్టీయూల పరిధిలోనే పరిష్కరించేలా అసోసియేషన్ పరంగా కృషి చేయాలని పేర్కొన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి. ప్రభుదాస్ మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ హెల్త్‌కేర్ ట్రస్ట్‌లో పెన్షనర్స్ అసోసియేషన్‌ను సభ్య సంఘంగా నమోదు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించినట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కోశాధికారి టీవీఎస్ఎస్ఆర్‌వీ శర్మ, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏక దంతాయ.. పార్వతీ తనయ పాహిమాం !

పలుచోట్ల పూజలు, నిమజ్జనాలు



మారీసుపేట శివాలయంలో లక్ష్మీ గణపతి అలంకరణ

వల్లభాపురం(కొల్లిపర): మండల వ్యాప్తంగా శుక్రవారం వినాయకుడి నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. వల్లభాపురంలో నిమజ్జనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళలు,యువకులు పెద్దఎత్తున తరలివచ్చి ఆటపాటలతో సందడి చేశారు. ముఖ్య అతిథులుగా మాచర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి , తెనాలి నియోజకవర్గం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. స్వామికి పట్టు వస్త్రాలు అందజేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయ ప్రతిమల్ని ట్రాక్టర్లపై పెట్టుకొని స్వయంగా ఎమ్మెల్యేలు ఇద్దరూ గ్రామంలో కొంత దూరం పురవీధుల్లో ఊరేగించారు. యువత చిందులు వేస్తూ ముందుకు సాగారు.అనంతరం కృష్ణా నదిలో నిమజ్జనాలు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ శ్రీనివాస రెడ్డి, ఎస్ఐ రవీంద్రరెడ్డి సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. తొలుత గ్రామంలోని ప్రధాన కూడలిలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అవుతు పోతిరెడ్డి, వంగా సుధాకర్‌రెడ్డి, ఆరిగ చంద్రారెడ్డి, యువత పాల్గొన్నారు.



వల్లభాపురంలో జరిగిన నిమజ్జనంలో ట్రాక్టర్ నడుపుతున్న మాచర్ల ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, తెనాలి ఎమ్మెల్యే శివకుమార్

రజకపేటలో పూజలు

తెనాలి అర్బన్: వినాయక చవితి వేడుకల్లో భాగంగా సాయిరామ్ యూత్ ఆధ్వర్యంలో రజకపేటలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని ప్రతిమకు శుక్రవారం పూజలు చేశారు. అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, యూత్ నిర్వాహకులు పాల్గొన్నారు.

స్వామికి విశేష పూజలు

తెనాలి టౌన్: వినాయక చవితి పండుగ సందర్భంగా పట్టణ, రూరల్ గ్రామాల్లోని వివిధ సెంటర్లలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాల వద్ద శుక్రవారం విశేషంగా పూజలు నిర్వహించారు. పూజల అనంతరం విగ్రహాల్ని ట్రాక్టర్లపై ఉంచి ఊరేగింపుగా భక్తి శ్రద్ధలతో కాల్వల్లో నిమజ్జనాలు చేశారు.

- మారీసుపేటలోని శ్రీ కోదండరామాలయంలో శ్రీ అయ్యప్పస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన శ్రీ వరసిద్ధ వినాయక స్వామికి పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.
- నాజరుపేటలోని పుట్టావారి వీధిలో శ్రీ వరసిద్ధ వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో గణేష్ విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. సూర్య శిల్పశాల అధినేత కాటూరి వెంకటేశ్వరరావు దంపతుల్ని నిర్వాహకులు సత్కరించారు. అన్నదానాన్ని వెంకటేశ్వరరావు ప్రారంభించారు.

కార్యక్రమంలో యేసుబాబు, సుధీర్, మురళీకృష్ణ, వెంకటనాగసాయి, సునీల్‌కుమార్, మహేష్, దినేష్, శివ, ప్రీతమ్, రాహుల్ పాల్గొన్నారు.

- మారీసుపేటలోని శ్రీ బాలత్రిపుర సుందరి సమేత శ్రీ చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద విశేష పూజలు జరిపారు. లక్ష్మీ గణపతిగా అలంకరణ చేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షులు గ్రంధి సేతు మాధవరావు, కార్యదర్శి పొన్నూరు నాగసూర్యశశిధరరావు, కోశాధికారి వరదా వెంకట శేషగిరి రావు, భక్తులు పాల్గొన్నారు.







రజకపేటలో అన్నదానం, మారీసుపేట కోదండ రామాలయంలో గణేష్ విగ్రహం వద్ద పూజలు, నాజరుపేటలో సూర్య శిల్పశాల నిర్వాహకులు వెంకటేశ్వరరావు దంపతులకు సత్కారం

ఖాళీ స్థలాలతో అనారోగ్య సమస్యలు

ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల



ఖాళీ స్థలాల్లో ఏర్పాటు చేసిన బోర్డులను పరిశీలిస్తున్న డాక్టర్ హెలెన్ నిర్మల

తెనాలి అర్బన్: పట్టణంలోని ఖాళీ స్థలాల యజమానులు వెంటనే స్పందించి బాగు చేయించుకోవాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల సూచించారు. 14వ వార్డులో ఖాళీ స్థలాల్ని శుక్రవారం ఆమె పరిశీలించి, వాటిలో మున్సిపల్ బోర్డుల్ని ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖాళీ స్థలాలు పల్లపు ప్రాంతాల్లో ఉండటం వల్ల నీరు చేరి దోమలు, పందులకు ఆవాసాలుగా మారుతున్నాయని చెప్పారు. దీని వల్ల దోమలు, రోగాల వ్యాప్తి పెరిగే అవకాశం ఉందని తెలిపారు. స్థల యాజమానులు మెరక తొలించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టరు ఎ.రామచంద్రరావు, డి.శ్రీనివాసరావు, వై.అనుపమ, శానిటరీ సెక్రటరీలు ఎస్.ప్రవీణ్‌కుమార్, ఎం.శాంతి ప్రియదర్శిని, కె.సంధ్య, జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మెదడుపై పరిశోధనా కేంద్రం ఏర్పాటు కృషి

కేఎల్‌యూ చైర్మన్ కోనేరు సత్యనారాయణ

తాడేపల్లిరూరల్: న్యూరాలజిస్టులు 2050 నాటికి మెదడు రుగ్మతలను తగ్గించడంపై మార్గదర్శకాలను అందిస్తారని కేఎల్‌యూ చైర్మన్ కోనేరు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో మెదడుకు సంబంధించిన వ్యాధులపై మరింత లోతుగా అధ్యయనం చేయడం కోసం కేఎల్‌యూలో పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ పరిశోధనలకు తమ యూనివర్సిటీతో కలసి పనామా శాస్త్ర సాంకేతిక శాఖ వారు అల్జీమర్స్(మతిమరుపు)వ్యాధి ప్రస్తుతం ఏ దశలో ఉంది, అది భవిష్యత్‌లో ఏ స్థాయిలో ప్రజలపైన ప్రభావం చూపునుంది అనే అంశంపై పలురకాలు పరిశోధనలు జరుపనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఈ పరిశోధనలపై మతిమరుపు వ్యాధిపై ప్రపంచంలోని 30 మంది వైద్యులు, శాస్త్ర వేత్తలు కలసి జర్నల్ ఆఫ్ అల్జీమర్స్ డిసీజ్ అనే అంతర్జాతీయ పత్రికలో పలు రకాల పరిశోధనా పత్రాలు ప్రచురించాని వివరించారు. దీనికి జార్జి ఫెర్రి ముఖ్య సంపాదకులుగా వ్యవహరిస్తుండగా, కేఎల్‌యూ ప్రొ చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాథ రావు ముఖ్య సంపాదకులుగాను, అమెరికా, ఆస్ట్రేలియా, చైనా, హాంకాంగ్, జపాన్ వంటి దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు ఉప సంపాదకులుగా ఉన్నారని తెలిపారు. కేఎల్‌యు, అమెరికా, జపాన్, యూరప్, ఎయిమ్స్, బెంగళూరులోని నిమ్‌హాన్స్, విజయవాడలోని విమ్‌హాన్స్, గుంటూరులోని బృంద హాస్పిటల్, మణిపాల్ వంటి పలు రకాల ఆస్పత్రులలోని వైద్య నిపుణుల సహకారం తీసుకుని కేఎల్‌యూలో పరిశోధనా కేంద్రం మెదడుపైన వినూత్న పరిశోధనలకు శ్రీకారం చుడతామని వివరించారు.

తల్లి మందలించిందని కుమార్తె ఆత్మహత్య

మంగళగిరి: తల్లి మందలించిందని కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కార్పొరేషన్ పరిధి నవులూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. నవులూరు ఎన్టీఆర్ కాలనీకి చెందిన గైరుబోయిన గురవయ్య– రమణమ్మ దంపతుల కుమార్తె గురులక్ష్మి(20) నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇంట్లో పని చేయాలని తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన గురులక్ష్మి తల్లి బయటకు వెళ్లగానే ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు సహాయంతో గురులక్ష్మి మృతదేహాన్ని కిందికి దించి పోలీసులకు సమాచారాన్ని అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మేలు

- ఇంటింటికి వైద్య బృందం సర్వే
- ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి
- డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రావణ్‌బాబు



దుగ్గిరాలలో ఇంటింటి సర్వే పరిశీలిస్తున్న గుంటూరు డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రావణ్‌బాబు

తాడేపల్లిరూరల్: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్య సమస్యల్ని పరిష్కరించుకోవాలని గుంటూరు డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు కోరారు. దుగ్గిరాల మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 30వ తేదీ నుంచి ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్నామని వివరించారు. ముందుగా ఆయా ప్రభుత్వ వైద్యశాలలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆశ వర్కర్లతో కలసి వైద్యులు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా? అనే విషయాన్ని తెలుసుకుంటారని, వారికి ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉన్నాయని తెలియజేస్తే వారికి సర్వేలో పాల్గొన్న సిబ్బంది ఒక టోకెన్ అందజేస్తారని చెప్పారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆ ప్రాంతంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేస్తారని తెలిపారు. అందులో జనరల్ చెకప్ చేసే డాక్టర్లతో పాటు స్పెషలిస్టులు కూడా ఉంటారని, వారికి అక్కడే 14 రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని డీఎంహెచ్‌వో వివరించారు.

బిల్లులో బహుజన మహిళలకు ప్రత్యేక వాటా కల్పించాలి

నెహ్రూనగర్: మహిళా రిజర్వేషన్ బిల్లులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ప్రత్యేక వాటా కల్పించాలని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ కోరారు. అరండల్‌పేట భీమ్ భారత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల్ని మభ్య పెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును తెరపైకి తెచ్చిందని తెలిపారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళల్ని విస్మరించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 1996లో ప్రవేశపెట్టిన బిల్లులో లోపాన్ని సవరించకుండానే పాత దాన్ని యథాతథంగా ప్రస్తుత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లోక్ సభలో ప్రవేశపెట్టిందని విమర్శించారు.

పాడి పెరుగుదలపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కొల్లిపర(తెనాలి): పాడి పశువుల్లో పాల ఉత్పత్తి పెరుగులకు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు సూచనలు చేశారు. కొల్లిపర మండల గ్రామం వల్లభాపురంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ సంచాలకుడు డాక్టర్ జి.వెంకటనాయుడు, సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ ఎం.గంగాదేవి, వెటర్నరీ సైంటిస్ట్ డాక్టర్ అర్చన, గృహ విజ్ఞాన శాస్త్రం నిపుణులు ఎం.దీపక్ పాల్గొన్నారు. పాడి పెరుగుదలతో పాటు అనుబంధంగా ఇంటి దగ్గర కోళ్లను పెంచాలని సూచించారు. మంచి పశువులకు 95 శాతం పెయ్య దూడలు మాత్రమే పుట్టేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు అజిటో బ్యాక్టీరియా, పాస్ఫో బాక్టీరియా, సుడోమోనాస్‌ను 100 కిలోల బాగా మాగిన పశువుల ఎరువులో కలిపి తయారు చేసుకుని, వరి, ఉద్యాన పంటల్లో వేయడం వల్ల ఎంతో ఉపయోగకరమని చెప్పారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాల్ని పొందవచ్చని తెలిపారు. ఈ బాక్టీరియా నేలకు కూడా చాలా ఉపయోగకరమైన సూక్ష్మజీవులుగా వివరించారు. కార్యక్రమంలో వల్లభాపురం గ్రామ సర్పంచ్ నిర్మల, ఉప సర్పంచ్ పోతిరెడ్డి, ప్రకృతి వ్యవసాయం వల్లభాపురం యూనిట్ మాస్టర్ ట్రైనర్ నాగకృష్ణ, మున్నంగి ఇన్‌ఛార్జి సుధారాణి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భారీ అన్నదానాలు



వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిరూరల్: గణేష్ నవరాత్రులలో భాగంగా ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి నేతాజీ సెంటర్‌లో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ అన్నదానాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సీతానగరం జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం కమిటీ సభ్యులు పురాణం వెంకటాచార్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఓలేటి రాము, పలగాని నాగబాబు, కాలూరి తిరుపతిరావు, రేఖా బాలాజీ, సూరగాని అనిల్‌కుమార్, గండికోట మురళీకృష్ణ, తల్లిబోయిన శ్రీను, విన్నప్రోలు నాగరాజు, షేక్ బాజీ, కర్పూరపు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నిడమర్రులో అన్నదానం

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని నిడమర్రు ఆంజనేయ స్వామి గుడి వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, స్థానిక ఉత్సవ కమిటీ ప్రతినిధులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఆకురాతి రాజేష్, తాడేపల్లి పట్టణ, రూరల్ కన్వీనర్లు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, మున్నంగి వివేకానందరెడ్డి పాల్గొన్నారు.

పోలీసు లాంఛనాలతో అనిల్ అంత్యక్రియలు



గౌరవ వందనం చేస్తున్న పోలీసు సిబ్బంది

ఫిరంగిపురం: గుంటూరులో ఎస్ఐ సెలక్షన్ విధులకు హాజరై తిరిగివస్తూ వేములూరిపాడు వద్ద లారీ ఢీకొనడంతో మృతి చెందిన ముప్పాళ్ల పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జి.అనిల్ అంత్యక్రియలు ఫిరంగిపురంలో క్రైస్తవ శ్మశాన వాటికలో శుక్రవారం సాయంత్రం పోలీసు లాంఛనాలతో నిర్వహించారు. అనిల్ స్వగ్రామం ఫిరంగిపురం కావడంతో మృతదేహాన్ని గ్రామంలో ఊరేగించి బాల ఏసుదేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం క్రైస్తవ శ్మశాన వాటికలో పోలీసు సిబ్బంది గౌరవ వందనం చేసి మూడు సార్లు గాలిలోకి కాల్చారు. కార్యక్రమంలో సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ, నరసరావుపేట -2 పట్టణ సీఐ వీరేంద్ర, పెదకూరపాడు సీఐ వీరాస్వామి, ముప్పాళ్ల ఎస్ఐ కిషోర్‌బాబు, ఏఎస్ఐలు మల్లికార్జునరావు, ఇమామ్ పాల్గొన్నారు.

ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు అమలు చేయాలి

నెహ్రూనగర్: ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్ కుమార్ కోరారు. ఈ మేరకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డాను ఢిల్లీలో కలసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్య, వైద్య విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టుల్ని తక్షణం భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానం వల్ల వైద్య విద్యలో ఎంతో మంది దళిత, గిరిజన విద్యార్థులు నష్టపోతున్నారని, దీని వల్ల భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో దళితులపై జరుగుతున్న దాడులు, అరాచకాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, వాటిపై ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి. రామ్మూర్తి, ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గోదా జాన్ పాల్, మహిళా విభాగ అధ్యక్షురాలు బందెల యాదలక్ష్మి, పిల్లి మేరి, గుంటూరు జిల్లా అధ్యక్షులు ధార హేమ ప్రసాద్, శీలం రోజన్ బాబు, సురేష్ పాల్గొన్నారు.

నేడు పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు శనివారం బీఆర్ స్టేడియంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం తెలియజేశారు. ఉదయం 8 గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందని, సీనియర్ వైద్యులు పాల్గొని పరీక్షలు నిర్వహిస్తారని ఆమె పేర్కొన్నారు.

రేపు పెదరావూరులో ఉచిత వైద్య శిబిరం

తెనాలి రూరల్: పట్టణానికి చెందిన వి కార్డియాక్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మండలంలోని పెదరావూరులో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. గ్రామంలోని జెడ్పీ హైస్కూలు ఆవరణలో ఉదయం 10 గంటలకు శిబిరం ప్రారంభమవుతుంది. ఈసీజీ, థైరాయిడ్, షుగరు, రక్త పరీక్షలు ఉచితంగా చేసి మందులు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చిన్న పిల్లలతో పాటు మహిళలు, గర్భిణులకూ వైద్య పరీక్షలు చేస్తామని, పెదరావూరు, పరిసర ప్రాంత ప్రజలు శిబిరానికి రావచ్చని సూచించారు.

అన్నమయ్య కీర్తనల గాయకులకు ఆహ్వానం

తెనాలి: పట్టణానికి చెందిన సాంస్కృతిక సంస్థ సంకీర్తన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అన్నమయ్య కీర్తనల ఆలాపన'కు శాస్త్రీయ సంగీతంలో ప్రవేశమున్న 30 ఏళ్లలోపు యువతీయువకులను ఆహ్వానిస్తున్నట్లు అధ్యక్షుడు డాక్టర్ కె.పురుషోత్తమరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి గలవారు అన్నమయ్య కీర్తనలు రెండు (పల్లవి, ఒక చరణం) పాడి 9849131035కు వాట్సాప్‌లో పంపించాలని కోరారు. వీరితో ఆడిషను నిర్వహించి, వారి గాత్ర ధర్మం ప్రకారం కీర్తనలు కేటాయించి తగిన శిక్షణనిస్తామని తెలిపారు. అనంతరం వాద్య సహకారంతో రిహార్సల్స్ చేయించి, డిసెంబరు 17వ తేదీన తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో నిర్వహించే గానాలాపనలో గాయనీగాయకులుగా పరిచయం చేస్తామని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మున్నంగి (కొల్లిపర): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని మున్నంగిలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొనగాల గంగాధర్ మోపెడ్‌పై పొలం నుంచి ఇంటికి వస్తుండగా, ఎదురుగా వస్తున్న గ్యాస్ లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

యువతి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: ఇంట్లో పని చేస్తున్న ఓ యువతి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ మూడో లైనులో భరత్‌కుమార్‌రెడ్డి నివాసం ఉంటున్నాడు. రెండు సంవత్సరాలుగా నెల్లూరుకు చెందిన పరిమళ (20) ఆయన ఇంట్లో పని చేస్తోంది. ఆమెకు తల్లిదండ్రులు ఇటీవల వివాహం చేసేందుకు సిద్ధమయ్యారు. ఇది ఇష్టంలేని పరిమళ మానసికంగా కృంగిపోయి గురువారం రాత్రి గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

గణేష్ నిమజ్జనంలో జరిగిన వివాదం నేపథ్యంలో ముగ్గురు వ్యక్తులు కలసి మరో వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. గణేష్ వారి వీధికి చెందిన దాసరి విష్ణు వినాయక విగ్రహ నిమజ్జనం సమయంలో కొందరు మద్యం తాగి గొడవ చేస్తుంటే వారించాడు. నిమజ్జనం అనంతరం రజాక్, ప్రశాంత్, సాయి కలసి విష్ణుపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో వైఎస్సార్ సీపీ పాలకవర్గం ఏర్పడిన తరువాత అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని 29వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రోషన్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని 95వ సచివాలయం పరిధిలో రూ.30 లక్షలతో నూతనంగా డ్రెయిన్ల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రోషన్ మాట్లాడుతూ తన డివిజన్‌లోనూ అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

అన్నదానం పుణ్య కార్యం: మేయర్

నెహ్రూనగర్: భక్తులకు అన్నదానం పుణ్య కార్యమని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు.నగరంలోని సంపత్ నగర్, నల్లచెరువు, ఆర్. అగ్రహారం, అమరావతి రోడ్డు తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి మేయర్ భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల్ని ఘనంగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అందుగుల సంతోష్, వైఎస్సార్ సీపీ నాయకులు సాదు రాజేష్, కంతేటి శ్యాం, శేఖర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఏడో డివిజన్‌లో...

పట్నంబజారు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఏడో డివిజన్ శీలంవారి వీధిలో శ్రీను, శివకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానాన్ని నగర డిప్యూటీ మేయర్ షేక్ సజిల ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు షేక్ షౌకత్, కిశోర్, సుధాకర్, చంద్రమోహన్, బసవయ్య పాల్గొన్నారు.